## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, పిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం



Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 03 సంచిక : 365 గురువారం 11-04-2024 పేజీలు :04 వెల:రూ.2.00


# భువనగిరి ఎంపి గెలుపే లక్ష్యం



హైదరాబాద్,ఏప్రిల్10 : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో జరగగా సిఎం రేవంత్ తదితరులు పాలొగన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈనెల 21న నామినేషన్ వేయనున్న నేపథ్యంలో అదే రోజు భువనగిరిలో బహిరంగ సభ నిర్వహించాలని సీఎం సూచించారు. మే తొలి వారంలో నిర్వహించే సభకు ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. గెలుపు కోసం ప్రజలను కలిసి నేరుగా ఓట్లు కోరాలని అన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా

## నేతలకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్



ఆముందుకు సాగాలన్నారు. మనం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల ముందు పెట్టాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజగోపాల్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతోపాటు ముఖ్యనాయకులు హాజరయ్యారు. భువనగిరిలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం నాయకులు , కార్యకర్తలు కృషి చేయాలని సీఎం కోరారు.

# కచ్చాతీవు మత్స్యకారుల అరెస్ట్‌పై మోదీ సంచలన ప్రకటన..



చెన్నై: లోక్‌సభ ఎన్నికల వేళ తమిళనాడులో ప్రజలకు ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. శ్రీలంకలో అరెస్ట్ అయిన మత్స్యకారులను క్షేమంగా భారత్‌కు తీసుకువస్తామని మోదీ హామీ ఇచ్చారు.కాగా, ప్రధాని మోదీ తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలూరులో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. ఈరోజు దేశం మొత్తం కాంగ్రెస్, డీఎంకే పార్టీల మరో కపట నాటకం గురించి చర్చిస్తోంది. కాంగ్రెస్ హయాంలోనే కచ్చాతీవు ద్వీపాన్ని శ్రీలంకకు అప్పగించారు. ఎవరి ప్రయోజనం కోసం కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఏ కేబినెట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు.కచ్చాతీవు ద్వీపం వద్దకు వెళ్లిన వేలాది మంది తమిళనాడు మృత్స్యకారులను శ్రీలంక కోస్టల్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరి అరెస్ట్‌పై కాంగ్రెస్ ఎందుకు మౌనం వహించింది. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం అరెస్ట్ అయిన మత్స్యకారులను క్షేమంగా వెనక్కి తీసుకువస్తుంది. అదొక్కటే కాదు మరణ శిక్షలు విధింపబడిన వారిని కూడా సజీవంగా వెనక్కి తీసుకువస్తున్నాం. వారిని వారి వారి కుటుంబాలకు అప్పగించే బాధ్యత బీజేపీది అని వ్యాఖ్యలు చేశారు.ఇదే సమయంలో అధికార డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమిళ సంస్కృతికి డీఎంకే వ్యతిరేకి. డీఎంకేది విభజన రాజకీ యం. తమిళులను చీకట్లో ఉంచేసింది. అవినీతి చేయడానికి డీఎంకే కాపీరైట్ తీసుకుంది. కుటుంబం మొత్తం తమిళనా డును దోచుకుంటోంది. తమిళనాడులో బీజేపీ చరిత్ర సృష్టించబోతోంది. రానున్న ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీ గెలవబోతోంది అంటూ కామెంట్స్ చేశారు.

## కంటోన్మెంట్ అభ్యర్థిని ప్రకటించిన కెసిఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 10, సికింద్రాబాద్ కంటోన్ మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు బిఆర్ఎస్ అభ్యర్థిని ఆ పార్టీ అధినేత కెసిఆర్ ప్రకటించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు, లాస్య నందిత సోదరి నివేదత పేరును అధికారికంగా కెసిఆర్ వెల్లడించారు. గత ఫిబ్రవరి నెలలో పటాన్ చెరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటోన్ మెంట్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో కంటోన్ మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే, కాంగ్రెస్ తమ అభ్యర్థిని ప్రకటించింది. కాంగ్రెస్ నుంచి కంటోన్ మెంట్ లో



నారాయణన్ శ్రీ గణేష్ పోటీ చేయనున్నట్లు వెల్లడించింది. ఇక, బిజెపి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. శ్రీ గణేష్.. ఇటీవల బిజెపి నుంచి కాంగ్రెస్ లోకి వచ్చారు.

## దేవుడి ఫోటోతో కాదు..మోడీ ఫోటోతో రండి

**కరీంనగర్‌కు ఏం చేశారో వినోద్, బండి చెప్పాలి**

**అంజన్న ఆశిస్సులతో 17 ఎంపి స్థానాలు మావే**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

జగిత్యాల,ఏప్రిల్10: దేవుడు మీకేనా.. మాకు కాదా.., దేవాలయాలకు ఏం చేశావ్ బండి సంజయ్ అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. రాముడి పేరుతో రాజకీయాలు మానాలని అన్నారు. దేవుడు అందరికీ దేవుడేనని అన్నారు. మంగళ సూత్రాన్ని అమ్ముకున్న నీకు కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడివని నిలదీశారు. కొండగట్టు అంజన్నను లిక్కర్ రాణి మోసం చేసిందని, పెద్ద విగ్రహం పెడతామని శఠగోపం పెట్టిందన్నారు. అందుకే అంజన్న అగ్రహించాడని, బీఆర్ఎస్, బీజేపీలవి మోసపూరిత హామీలని మండిపడ్డారు. బీఅర్ఎస్, బీజేపీలవి మోసపు హామీలని పొన్నం ప్రభాకర్ దుయ్యబట్టారు. ఇకపోతే డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఉన్నచోట్ల కాంగ్రెస్ ఓట్లు ఆడగదని.. ఇందిరమ్మ ఇండ్లు ఉన్నచోట బీఆర్ఎస్ ఓట్ల అడగవద్దంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. మంత్రి కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు పొన్నం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. కాంగ్రెస్ పార్టీ వాగ్దానం ఇస్తే ఎట్టి పరిస్థితుల్లోనైనా పక్కాగా అమలు చేసి తీరుతుందని చెప్పారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులతో తెలంగాణలో 17 ఎంపీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్లలో కేసీఆర్, వినోద్ కుమార్ కరీంనగర్ పార్లమెంటుకు ఏం చేశారో చెప్పాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. బండి సంజయ్ మతపరమైన అంశాలు కాకుండా ప్రజలకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఎన్నడూ కారులోంచి కాలు కింద పెట్టని వినోద్ కుమార్... ఇవాళ మార్నింగ్ వాక్ పేరుతో ఓటర్లను ప్రజలను మోసం చేస్తున్నారని పొన్నం విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, అప్పుడే పేదల కష్టాలు తీరుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ పార్లమెంటు స్థానానికి పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం అందరం కలిసి కృషి చేస్తామని చెప్పారు. కొండగట్టు అంజన్న సన్నిధి నుండే ఎన్నికల పోరును ప్రారంభిస్తున్నానని తెలిపారు. బండి సంజయ్, వినోద్ కుమార్ లు అబద్దాల ప్రచారం మానుకొని నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని హితవు పలికారు.బీజేపీ ఎంపీ బండి సంజయ్ పై తీవ్ర విమర్శలు చేశారు. నరేంద్రమోదీ ఫోటో పెట్టుకుని ఎన్నికలకు వెళ్ళే దమ్ముందా బండి సంజయ్? అంటూ ప్రశ్నించారు.



## నాటి నుంచి అక్కడ గులాబీదే హవా.. మళ్లీ ఘన విజయం బీఆర్ఎస్‌దే

సంగారెడ్డి : మెదక్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ పార్టీ అడ్డా. మెదక్‌లో వెంకట్రామి రెడ్డి ఘన విజయం సాధించబోతున్నారు. 2004 నుంచి మెదక్‌లో బీఅర్ఎస్ పార్టీ గెలుస్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం పటాన్ చెరువు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని శ్రీ సిద్ది గణపతి దేవాలయం (గణేష్ గడ్డ) ఆవరణలో బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. గులాబీ జెండా పుట్టినప్పటి నుంచి మెదక్ పార్లమెంట్ స్థానాన్ని బీఅర్ఎస్ గెలుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మళ్లీ మెదక్ పార్లమెంట్‌లో తిరుగులేని మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. ఓట్ల కోసం ప్రజలను నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. రూ.4 వేల పింఛన్లు, రైతుబంధు, మహిళలకు రూ.2,500 ఇలా ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ వాళ్లు గారడి మాటలు చెప్పారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ పై తిట్ల పురాణం మొదలు పెట్టాడు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసింది..రేవంత్ రెడ్డి తిట్ల కోసమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్ వార్తలు, లీకులతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రైతులను పట్టించుకోలేదని చెప్పారు. వెంకట్రామిరెడ్డి పక్కా లోకల్.. తెల్లాపూర్‌లోనే నివాసం ఉంటారని పేర్కొన్నారు.వెంకట్రామిరెడ్డి అధికారిగా మెదక్ జిల్లా ప్రజలకు సేవ చేశారని తెలిపారు. మంచి మనిషి, పరిపాలన అనుభవం ఉండి ప్రజలకు అందుబాటులో ఉండే వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. దుబ్బాక ప్రజలు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును చిత్తు చిత్తుగా ఓడించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు.బీఆర్ఎస్ పార్టీయేనని, మన ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేసే వెంకట్రామి రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మెదక్ లోక్ సభ అభ్యర్థి వెంకటరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.



## రాముడితో మనకు పంచాయితీ లేదు.. కేవలం బీజేపీతోనే : కేటీఆర్

మేడ్చల్ మల్కాజ్‌గిరి : శ్రీరాముడు అందరివాడు.. ఆ రాముడితో మనకు పంచాయితీ లేదు.. పంచాయితీ అంతా బీజేపీతోనే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.ఈ పదేండ్లలో ఏం చేశారని బీజేపోళ్లను ప్రశ్నిస్తే జైశ్రీరాం అంటారు. మనకు రాముడితో పంచాయితీ లేదు.. రాముడికి మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం. రాముడు బీజేపీ పార్టీ మనిషి కాదు.. ఆయన అందరి మనిషి. ఆయన లోక ప్రియుడు. అలాంటి రాముడితో మనకు తగాదా లేదు. రాముడి పేరు చెప్పుకుని రాజకీయం చేసే బీజేపీని తన్ని తరిమేయాలన్నారు కేటీఆర్.ఈ పదేండ్లు ఏం చేశారని ప్రశ్నిస్తే చెప్పేటందుకు బీజేపీ నేతల వద్ద ఏం లేదు. రైతు రుణమాఫీ విషయంలో ఈటల రాజేందర్ బాధపడుతున్నారట. రూ. పద్నాలుగున్నర లక్షల కోట్ల రుణాలను బడా వ్యాపారులకు మోదీ మాఫీ చేశారు. కానీ రైతులకు సంబంధించి ఒక్క రూపాయి రుణం కూడా మాఫీ చేయలేదు. కరోనా సమయంలో కూలీలు తమ సొంతూర్లకు వెళ్లేందుకు కనీసం ఫ్రీ రైళ్లు పెట్టలేదు మోదీ. కేసీఆర్ మాత్రం 180 రైళ్లు ఫ్రీగా పెట్టి రూ. 500 ఇచ్చి బీహార్, యూపీకి పంపించారు. కానీ మనసు లేని మోదీ ఆ పని చేయలేకపోయారు. ఇవన్నీ మరిచిపోవద్దు. పెద్ద నోట్లు రద్దు చేసి దేశాన్ని ఆగం చేశాడు. పెద్ద పెద్ద సేట్లకు పని చేసే మోదీ.. మనకు, తెలంగాణకు ఏం పని చేయలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.తెలంగాణపై బీజేపీకి ప్రేమ ఉంటే.. భద్రాచలం టెంపుల్‌కు ఒక్కరూపాయి అయినా ఇచ్చిందా..? అయోధ్య రాముడే రాముడా..? భద్రాచలం రాముడు రాముడు కాదా..? ఘట్కేసర్‌లో రామలింగేశ్వర స్వామి టెంపుల్‌కు ఒక్క రూపాయి అయినా కిషన్ రెడ్డి ఇచ్చారా..? ఒక్క రూపాయి కూడా ఇవ్వని బీజేపీకి ఓటు వేద్దామా..? యాదాద్రిని రాజకీయంగా వాడుకోలేదు. దేవుడు దేవుడే.. ధర్మం ధర్మమే.. రాజకీయం రాజకీయమే. ఎవరు మన కోసం పని చేస్తున్నారో.. ఎవరు దేవుళ్లను అడ్డం పెట్టుకుని బతుకుతున్నారో ప్రజలకు వివరించాలి. నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల, మతోన్మాదానికి కారణమైన బీజేపీని పాతరేయాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.



## కవిత కేసులో సిబిఐ ఇంటరాగేషన్

**సవాల్ చేస్తూ కవిత పిటిషన్**

**26కు వాయిదా వేసిన కోర్టు**

న్యూఢిల్లీ,ఏప్రిల్10 : ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సీబీఐ ఇంటరాగేషన్ చేయడాన్ని కవిత తరపు న్యాయవాదులు తప్పుబట్టారు. సీబీఐ ప్రశ్నించడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై ఈనెల 26న సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ జరుగనుంది. ఇప్పటికే కోర్టులో వాదనల సందర్భంగా కవితను తీహార్ జైల్లో విచారించామని కోర్టుకు సీబీఐ తెలిపింది. అయితే పిటిషన్‌పై రిప్లై కాపీ ఇవ్వలేదు. దీనిపై రిప్లై ఇవ్వాల్సిన అవసరం లేదని సీబీఐ తెలిపింది. అటు కవిత తరపున రాణా, మోహిత్ రావు వాదనలు వినిపించారు. సీబీఐ తమకు రిప్లై కాపీ ఇవ్వలేదని కవిత తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సీబీఐ విచారణపై శనివారం సాయంత్రం 5:30 గంటలకు ఆర్డర్ వచ్చిందని తెలిపారు. అయితే కవితను 6వ తేదీన మధ్యాహ్నం 12:30 గంటలకే సీబీఐ విచారించిందని చెప్పారు. ఆర్డర్ రాకుండానే సీబీఐ విచారణ జరిపిందని కవిత తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. ముందుగా విచారించాలంటే మరోసారి అప్లికేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని జడ్జి సూచించారు. దీంతో 26వ తేదీన వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని సీబీఐ చెప్పింది. ఈ క్రమంలో ఈ కేసు తదుపరి విచారణను కోర్టు ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు వాయిదా వేసింది.

## సుప్రీం కోర్టులోనూ.. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మరో ఎదురుదెబ్బ



ఢిల్లీ,: మద్యం పాలసీ కేసులో అరెస్టైన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. వచ్చే వారం వరకు జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తిహార్ జైలులో (రిమాండ్ ఖైదీగా) కొనసాగనున్నారు.కేజ్రీవాల్ తన అరెస్ట్ అక్రమమని, ఈడీ అరెస్ట్‌ను రద్దు చేయాలని నిన్న ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. అయితే ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తిరస్కరించారు. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది, సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ బుధవారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ముందు తన క్లయింట్ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అందుకు ఈరోజు విచారణకు అనుమతిస్తారో లేదో చెప్పేందుకు ప్రధాన న్యాయమూర్తి నిరాకరించారు. అందుకు 'చూస్తాం, పరిశీలిస్తాం' అని చెప్పారు.కాగా, కేజ్రీవాల్ అప్పీల్‌పై అత్యవసర విచారణ కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయదని తెలుస్తోంది. సుప్రీంకోర్టు క్యాలెండర్ ప్రకారం..గురువారం ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా కోర్టు కార్యకలాపాలు జరగవు. శుక్రవారం స్థానిక సెలవుదినం, ఆపై వారం ముగుస్తుంది. సోమవారం తిరిగి సుప్రీం కోర్టు కార్యకలాపాలు పున: ప్రారంభం అవుతాయి. అప్పటి వరకు తీహార్ జైల్లో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ కొనసాగనుంది

శ్రీ ప్రస్థానం

## సంపాదకీయం

# పార్లమెంట్ లో సాగని ఫలప్రదమైన చర్చ

స్వాతంత్ర భారతంలో ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా భారత పార్లమెంటు నిలుస్తుందని నాడు మన రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. 1952 నుంచి నేటి వరకు మన దేశం 17 లోక్‌సభల పనితీరును చూడగా, 2024 జూన్ 4 నాటికి 18వ లోక్‌సభ ఏర్పడబోతోంది. ఈ నేపథ్యంలో గడచిన 17వ లోక్‌సభా కాలంలో ఎలా గడిచిందో ఓసారి తెలుసుకునే ప్రయత్నిం చేద్దాం. 17వ లోక్‌సభ చిట్టచివరి సమావేశం జరిగిన రోజు దేశ ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ సభా కాలంలో 97% సమయం సద్వినియోగం అయిందనీ, ఈ ఐదేళ్ల కాలంలో జరిగిన 7 సెషన్లు 100% కంటే ఎక్కువ ఉపయుక్తంగా నడిచాయని చెప్పుకొచ్చారు. ఆయన మాటలను వింటున్నప్పుడు గత 77 ఏడేళ్లలో తమ హయాంలోనే చట్టసభలు సక్రమంగా పనిచేస్తున్నాయనే రవ్వంత అతిశయమూ కనిపించింది. అయితే, తన పాలనా కాలంలో విస్మరించిన కొన్ని ప్రజాస్వామ్య సంప్రదాయలపై ప్రధాని మౌనం వహించారు. 1969 నుంచి లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి ఇచ్చే సంప్రదాయానికి పాతరేస్తూ, అసలు ఎన్నికే జరపకుండా మౌనం వహించారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి ఈ ప్రభుత్వ హయాంలోనే ఇలా జరిగింది. గడచిన ఐదేళ్ల కాలంలో మన లోక్‌సభ ఎంత గొప్పగా పనిచేసిందో తెలుసుకునేందుకు కొన్ని గణాంకాలను పరిశీలిద్దాం. వాజపేయి ప్రధానిగా ఉన్న 1999 ? 2004 మధ్యకాలపు 13వ లోక్‌సభ 423 రోజులు పనిచేసింది. కానీ, 17వ లోక్‌సభ కేవలం 278 రోజుల్లోనే సమావేశమైంది. అంటే 13వ లోక్‌సభ కంటే 17వ లోక్‌సభ సుమారు 34% సమయం తక్కువ పనిచేసింది. 2020 ? 2022 మధ్యకాలంలో లోక్‌సభ సమావేశాలు ఏడు పర్యాయాలు అనుకున్న షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. అంతేగాక.. 2023లో జరిగిన చివరి ప్రత్యేక సెషన్‌తో పాటు శీతాకాల సమావేశాలు కూడా షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. ఇలా షెడ్యూల్ కంటే ముందే సెషన్ ముగిస్తే.. ఆ కోత పెట్టిన రోజుల్లో ఎంపీలు అడగాల్సిన ప్రశ్నలు మిగిలిపోతాయని ప్రభుత్వానికి అనిపించలేదు. ఇక ఆర్డినెన్స్‌ల జారీలోనూ 17వ లోక్‌సభా కాలపు ప్రభుత్వం రికార్డులకెక్కింది. పదేళ్ల యుపిఎ హయాంలో నాటి కేంద్ర ప్రభుత్వం 61 ఆర్డినెన్స్‌లు జారీ చేయగా, 2014 నుండి 2021 మధ్యనే ఏకంగా 76 ఆర్డినెన్స్‌లు జారీ అయ్యాయి. 2019 నుంచి డిసెంబర్ 21, 2023 నాటికి లోక్‌సభలో 86, రాజ్యసభలో 103 బిల్లులను 2 గంటల కంటే తక్కువ టైంలో చర్చించి పాస్ చేశారు. 2023 వర్షాకాల సమావేశంలో రాజ్యసభ ఫార్మసీ (సవరణ) బిల్లును కేవలం 3 నిమిషాల్లోనే ఆమోదించి కొత్త రికార్డును సృష్టించింది. ఆ మర్నాడే సెంట్రల్ జిఎస్‌టి సవరణ, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి సవరణ బిల్లులను మన లోక్‌సభ సరిగ్గా మూడే నిమిషాల్లో ఆమోదించింది. అంతేకాదు.. అసలు ఎజెండాలోని బిల్లులను పక్కనబెట్టి, హటాత్తుగా కొత్తబిల్లులు తీసుకొచ్చి వాటిని నిమిషాల వ్యవధిలో ఆమోదించిన ఘనతా 17వ లోక్‌సభకే దక్కుతుంది. 2009 ? 2014 మధ్యకాలంలో నాటి ప్రభుత్వం 71% బిల్లులను స్టాండింగ్ కమిటీలకు పంపగా, 2019 నుండి కేవలం 16% బిల్లులు మాత్రమే స్టాండింగ్ కమిటీ ముందుకు పరిశీలన కోసం వెళ్లాయి. 2014 ? 2021 మధ్యకాలంలో మన పార్లమెంటులో ప్రవేశపెట్టిన 301 బిల్లులలో 74 బిల్లులు (24.5%) బిల్లులు మాత్రమే సంప్రదింపుల కోసం సర్క్యులేట్ చేశారు. అయితే, ఈ 74 బిల్లులలో కనీసం 40 బిల్లులను విపక్షం పరిశీలించేందుకు ఇవ్వాల్సిన నెలరోజుల వ్యవధిని ఈ ప్రభుత్వం కుదించివేసింది. సమాజాన్ని బాగా ప్రభావితం చేసే, దేశ, సమాజపు తక్షణ ప్రాధాన్యమున్న అంశాలపై చర్చించాలని రూల్ నంబరు 267 కింద విపక్ష సభ్యులు అనేకసార్లు లేవనెత్తినా వారికి మాట్లాడే అవకాశం రాలేదు. లోక్‌సభలో సభానాయకుడిగా ఉన్న ప్రధాని మోదీ 'రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం' మీద తప్ప ఈ ఐదేళ్ల కాలంలో కీలకమైన ఏ అంశంమీదనైనా సభలో నిలబడి సభ్యుల అనుమానాలు దూరంచేయలేకపోయారు. మరీ ముఖ్యంగా కీలకమైన 3 క్రిమినల్ బిల్లుల విషయంలో హోం వ్యవహారాల కమిటీ ప్రజల నుండి ఎలాంటి సలహాలను గానీ సూచనలను గానీ ఆహ్వానించలేదు. ఈ క్రిమినల్ బిల్లుల విషయంలో సర్కారు ఆత్రుత, నాటకీయత ఎంతగా కనిపించిందంటే.. ఈ బిల్లుల మీద అభిప్రాయాలు చెప్పే అవకాశం ప్రభుత్వం నిర్ణయించిన వ్యక్తులకు మాత్రమే దక్కింది. నిలదీసిన విపక్షానికి సర్కారు మౌనమే సమాధానమైంది. ఇక 2014 నుంచి చివరి సెషన్ వరకు కేవలం ఐదంటే ఐదు బిల్లులే ఉమ్మడి పార్లమెంటరీ కమిటీల ముందుకు వెళ్లాయి. 2016–2023 మధ్యకాలంలో వచ్చిన బడ్జెట్ సమావేశాల్లో 79% సెషన్స్‌లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదాలు జరిగిపోయాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఆయా శాఖలు తమ శాఖ కేటాయింపులను లోతుగా పరిశీలించి, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 40 రోజుల సమయం ఇచ్చేవారు. 2016 నుంచి అది సగానికి కుదించబడింది. ఈ గణాంకాలను బట్టి ఈ ప్రభుత్వానికి చర్చల మీద, సంప్రదింపుల మీద ఎంత నమ్మకం ఉన్నాయో అర్థమవుతుంది. చివరకు 2023 డిసెంబరు 13న ఇద్దరు ఆగంతకులు జీరో అవర్ జరుగుతుండగా, గ్యాలరీల్లోంచి దూకటంతో అప్పటిదాకా గొప్పగా కీర్తించబడిన ఈ గొప్ప భవనపు భద్రతా ప్రమాణాలు ఏపాటివో బయటపడ్డాయి. దీనిపై ప్రధాని, హోంమంత్రి ఓ ప్రకటన చేయాలని అడిగిన పాపానికి 146 మంది ఎంపిలను సస్పెండ్ చేసి పారేశారు. సరిగ్గా వారి సస్పెన్షన్ తర్వాత ప్రభుత్వం హడావుడిగా 3 క్రిమినల్ బిల్లులు, టెలీ కమ్యూనికేషన్ బిల్లులు, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకపు బిల్లులను తీసుకొచ్చి వేగంగా వాటిని ఆమోదింపజేసుకుంది. వైవిధ్య భరితమైన సంస్కృతీ సంప్రదాయాలు, లెక్కకు మించిన భాషలు, ప్రపంచపు అతి పెద్ద జనాభాకు ఆలవాలమైన ఈ దేశాన్ని పాలించే పాలకులు ఈ దేశపు బహుళత్వపు విలువలను గౌరవించి, విపక్షపు భిన్నాభిప్రా యాన్ని వినేందుకు సిద్ధంగా లేని రోజు.. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్యమనే మాట కేవలం కాగితాలమీద ఉంటుందేమో గానీ, ఆచరణలో మాత్రం అది భిన్నాభిప్రాయాన్ని పట్టించుకోని అధ్యక్ష ప్రజాస్వామ్యమే అవుతుంది.

# భాగ్యనగరానికి డేంజర్ బెల్స్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (న్యూస్ పల్స్) వేసవి వచ్చేసింది. మార్చిలోనే మాడు పగిలేలా ఎండలు దంచికొట్టాయి. ఏప్రిల్‌లో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సీయస్‌కుపైగా నమోదవుతున్నాయి. ఇంకా మే నెల మిగిలే ఉంది. రోహిణి కార్తెలో రోకళ్లు పగిలేలా ఎండలు కొట్టడం ఖాయం. మరోవైపు వాతావరణ శాఖ ఇప్పటికే ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తోంది. ఈ క్రమంలో రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో అన్న ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది. ఈ క్రమంలో భాగ్యనగరానికి బిగ్ అలర్ట్ తెరపైకి వచ్చింది. హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు అన్న అంశం తాజాగా తెరపైకి వచ్చింది. ఇప్పటికే బెంగళూరు నీటి ఎద్దడితో అల్లాడుతోంది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఇటీవల వెల్లడించిన ఓ అధ్యయనంలో కాంక్రీట్ నిర్మాణాలు పది రెట్లు పెరగడం కారణంగా భూగర్భ నీటిమట్టాలు 79 శాతం తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పరిస్థితి ఏమిటి అన్న చర్చ జరుగుతోంది. బెంగళూరు పట్టణ విస్తరణ 1973లో 8 శాతం ఉండగా, 2023 నాటికి 93.3 శాతానికి పెరిగింది. ఈమేరకు నీటి వనరులు పెరగలేదు. పట్టణ విస్తరణ పెరగడానికి, నీటి మట్టాలు తగ్గడానికి బలమైన సంబంధం ఉందని అధ్యయనం తెలిపింది. పట్టణం అంతా కాంక్రీట్ జంగిల్ కావడంతో నీరు ఇంకే అవకాశం లేక భూగర్భ జలాలు క్రమంగా పడిపోతూ వచ్చాయని వెల్లడించింది. ఇప్పుడు హైదరాబాద్‌ను ఈ నివేదిక భయపెడుతోంది. వాస్తవానికి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రికార్డుల ప్రకారం హైదరాబాద్‌లో 185 నోటిఫైడ్ నీటి కుంటలు ఉన్నాయి. అయితే వీటిలో ఎక్కువ శాతం కలుషితం అవగా 20 వనరులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో హైదరాబాద్‌కు కూడా నీటి సమస్య తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోటిన్నర జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మహానగరానికి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, సింగూర్, మంజీరా, కృష్ణా 1,2, 3, గోదావరి ఫేజ్ –1 నుంచి నీటి సరఫరా జరుగుతుందని జలమండలి అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని కోర్ సిటీ ఉఊఓఅ 1098 ఓఒఆ, రాఖీఖీ ఏరియాల్లో 270ఓఒఆ, మిషన్ భగీరథ 150 ఓఒఆ సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. గత ఏడాదితో పోల్చితే



ఈ ఏడాది 4.12శాతం నీటి సరఫరాకు డిమాండ్ పెరిగిందన్నారు అధికారులు. హైదరాబాద్ మహానగరంలో నీటి సమస్యపై 1700 ప్రాంతాలు, 37వేల ఇండ్లలో సర్వే చేయించిన వాటర్ బోర్డు, డిమాండ్‌కు కారణం గ్రౌండ్ వాటర్ తగ్గడమే అని తేల్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు వస్తాయనే ఇంకుడుగుంతలు లేని వాళ్ళు ఖచ్చితంగా ఏర్పాటు చేసేలా ఆదేశాలు ప్రభుత్వం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 37 మందికి నోటీసులు కూడా జీహెచ్‌ఎంసీ నుంచి ఇచ్చినట్లు వివరించారు. నగరంలో వాటర్ సమస్య ఉన్నప్పటికీ గత ఏడాది మార్చి నెలలో 21వేల మంది కస్టమర్స్ వాటర్ ట్యాంకర్లు అడిగితే, ఇప్పుడు 31వేల ట్యాంకర్లకు డిమాండ్ పెరిగినట్లు తెలిపారు. మహానగర వ్యాప్తంగా 78 పిల్లింగ్ స్టేషన్లు ఉంటే 700 ట్యాంకర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఇక, రాబోయే రోజుల్లో డిమాండ్ మరింత పెరిగేటువంటి అవకాశం ఉన్నది. ఇప్పుడు ఒక నెల రోజుల్లో 1,50,000 ట్రిప్పులు నీళ్లను అందిస్తుంటే, మేలో రెండు లక్షల 50 వేలు, జూన్ జూలైలో మూడు లక్షల వారికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందని వాటర్ బోర్డు అంచనా వేస్తోంది. వీటన్నిటిని తట్టుకోవాలంటే ఇప్పుడున్న ట్యాంకర్లతో పాటు మరొక 300 ట్యాంకర్లను సైతం పెంచాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 300 మంది డ్రైవర్లను సైతం తీసుకున్నామని, రెండు వందల మంది వరకు రిపోర్ట్ కూడా చేశారని వివరించారు. ఇక డొమెస్టిక్‌తో పాటు బేవరేజ్‌కు సైతం నీటిని సరఫరా చేస్తున్నామని బేవరేజ్ కంపెనీలు వాటర్ బోర్డ్‌కు ఎంతో ముఖ్యమైనదని ఎలాంటి పరిస్థితులు వచ్చిన బేవరేజ్ కు వాటర్ ను ఆపే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్. డొమెస్టిక్ కంటే బేవరేజ్ నుంచే దాదాపు కేవలం 40 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అన్నారు. అయితే నగరానికి సరిపడేంత నీటి లభ్యత ఉన్నప్పటికీ వాటిని ప్రజలకు చేర్చేందుకు కావలసిన ట్యాంకర్లు ఎక్విప్మెంట్ మ్యాన్ పవర్ మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదని, వాటన్నిటిని వచ్చే వారం పది రోజుల్లోనే సెట్ రైట్ చేస్తామన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు అన్ని వస్తువులు కల్పిస్తామని అన్నారు దానికిషోర్. ప్రస్తుతానికి గ్రేటర్ హైదరాబాద్‌లో 2వేల ఓఒఆ వాటర్ ను సప్లై చేస్తున్నామని భవి ష్యత్తులో ఈ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూస్తామంటున్నారు. సోషల్ బిల్డప్ చేయడమే కాకుండా? ఎమర్జెన్సీ పంపింకు సైతం ఏర్పాటు చేశామ ని జల మండలి అధికారులు తెలి పారు. నగర ప్రజలకు బెంగళూరు తరహా ఇబ్బందులు రావని రాబోవని పేర్కొన్నారు. కానీ అధికారుల ఏర్పాట్లు ఒకవైపు, గ్రౌండ్ లెవెల్ లో డిమాండ్ మరోవైపు చూస్తుంటే కచ్చితంగా రాబోయే రోజుల్లో నీటి కటకట తప్పే విధంగా లేదు అన్నట్లుగానే అనిపిస్తుంది. అధికారులు మాత్రం ధీమాతోఉన్నారు. చూడాలి రాబో యే రెండు నెలల కాలాన్ని అధి కారులు ఎలా హ్యాండిల్ చేస్తారో..! ఇప్పటికే సిటీ ఔట్‌కట్స్‌లో తీవ్ర నీటి సమస్య మొదలైంది. ఈ నేపథ్య ంలో? ఇప్పటికైనా వర్షపునీరు భూమిలో ఇంకేలా చర్యలు చేపట్టాలని పర్యావరణ వేత్తలు సూచిస్తు న్నారు. 200 చదరపు మీటర్ల కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వర్షపు నీటి గుంతలు ఏర్పాటు చేయాలని పేర్కొం టున్నారు. లేదంటే హైదరాబాద్ కూడా త్వరలోనే మరో బెంగళూరు అవుతుందని హెచ్చరిస్తున్నారు.

# ఖమ్మం కాంగ్రెస్ పై ఉత్కంఠ




ఖమ్మం, ఏప్రిల్ 10, గత శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు దక్షిణ తెలంగాణ గట్టి దెబ్బ తీసింది. ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల్లో బీఆర్ఎస్ 36 సీట్లలో కేవలం 4 సీట్లు మాత్రమే గెలిచింది. మహబూబ్ నగర్ జిల్లాలో 14 సీట్లలో కాంగ్రెస్ 12 సీట్లు గెలవగా, బీఆర్ఎస్ కేవలం రెండు సీట్లు మాత్రమే గెలిచింది. గద్వాల నుంచి బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అలంపూర్ నుంచి విజయుడు మాత్రమే కారు పార్టీ నుంచి గెలిచారు. నల్గొండ జిల్లాలో 12 సీట్లకు ఒక్క సూర్యాపేట నుంచి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గెలిచారు. 11 సీట్లు హస్తం కైవసం చేసుకుంది. ఖమ్మం జిల్లాలో పది సీట్లకు 8 కాంగ్రెస్ కైవసం చేసుకోగా, సీపీఐ కొత్తగూడెంలో గెలిచింది. భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు కారు గుర్తుపై గెలిచారు. ఇటీవలే తెల్లం వెంకట్రావు హస్తం గూటికి చెరారు. గత ఎన్నికల్లో ఖమ్మం జిల్లా నుంచి అసెంబ్లీకి కారు గుర్తుపై ఏ ఒక్క ఎమ్మెల్యేని గెలవనివ్వబోమని వార్నింగ్ ఇచ్చిన ఆ జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పంతాన్ని ఇలా నెగ్గించుకున్నారు. 2018 ఎన్నికల్లో తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఓడిపోయారు. పొంగులేటి అనుచరుడిగా తెల్లం వెంకట్రావుకు ముద్ర పడింది. బీఆర్ఎస్‌తో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పొసగక పోవడంతో ఆయన అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ సమక్షంలో కారు దిగి హస్తం గూటికి చేరారు. పొంగలేటితోపాటు తెల్లం కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే కాంగ్రెస్ నుంచి భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు టికెట్ ఖరారు అవడంతో తిరిగి నెల రోజుల లోపే తెల్లం మళ్లీ కారెక్కారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేసి 2024 ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో గెలిచి కారు పార్టీ పరువు కాపాడారు. కాంగ్రెస్ అధికార పీఠం దక్కించుకోవడంతో, పొంగులేటి అనుచరుడిగా ముద్ర ఉండటంతో ఎప్పటికైనా కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమని ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఊహాగానాలు సాగాయి. దానికి అనుగుణంగానే. అప్పటి నుంచి తెల్లం వెంకట్రావు ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి, భట్టి విక్రమార్క,తుమ్మలతో సన్నిహిత సంబంధాలు నెరిపారు. ముఖ్యమంత్ర రేవంత్ రెడ్డితో కుటుంబంతో కలిశారు. అయినా బీఆర్ఎస్ వీడేది లేదని చెబుతూనే, గులాబీ పార్టీ కార్యక్రమాలకు దూరం ఉన్నారు. మెడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరూ హజరైనా తెల్లం డుమ్మా కొట్టారు. బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశాలకు హజరు కాలేదు. చివరకు తుక్కుగూడాలో జరిగిన కాంగ్రెస్ జన జాతర సమావేశంలో పాల్గొన్నారు. ఆ మరుసటి రోజే ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 2019 ఎన్నికల్లో ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి నామానాగేశ్వరరావు ఇక్కడి నుంచి గెలిచారు. ఇప్పుడు మాత్రం బీఅర్ఎస్‌కు ఇక్కడ గెలవడం కష్టమే అని చెప్పాలి. 2014లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం స్థానం నుంచి జలగం వెంకట్రావు ఒక్కరే బీఆర్ఎస్ నుంచి గెలిచారు. 2018 ఎన్నికల్లోనూ ఖమ్మం శాసన సభ స్థానం నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ గెలుపొందారు. అయితే ఈసారి ఖమ్మం పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు స్థానాల్లో ఆరింటిని కాంగ్రెస్ గెలవగా, కాంగ్రెస్ మిత్ర పక్షమైన సీపీఐ మరో స్థానంలో గెలిచింది. ఈ పరిస్థితుల్లో ఈ దఫా బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వర్‌రావు గెలుపు ఏదో అద్భుతం జరిగితే తప్ప అంత ఈజీ కాదన్న అభిప్రాయం సర్వత్రా నెలకొంది. గత శాసన సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానం పరిధిలో వచ్చిన ఓట్లు చూస్తే.. బీఆర్ఎస్ కన్నా కాంగ్రెస్ 2.70 లక్షల మెజార్టీని గత శాసన సభ ఎన్నికల్లో సాధించింది. ఇది తప్పనిసరిగా గెలిచే సీటు కావడంతో జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమ కుటుంబ సభ్యులకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో వీరిలో ఒకరి కుటుంబ సభ్యుడికి టికెట్ ఇస్తే మిగతా ఇద్దరు ముఖ్య నేతలు సహకరిస్తారా లేదా అనే డౌట్ కాంగ్రెస్ అధినాయకత్వంలో ఉంది. వీరు ముగ్గురిని కాదని వేరే వ్యక్తికి ఇస్తే.. గత శాసన సభ ఎన్నికల్లో కలిసి పని చేసినంత తీవ్రతతో కాంగ్రెస్ గెలుపునకు ఈ ముగ్గురు సీనియర్లు పని చేస్తారా లేదా అనే చర్చ నడుస్తోంది. ఖమ్మం టికెట్ ఆశిస్తున్న నేపథ్యంలో వీరి మధ్య విబేధాలు తమను గట్టెక్కిస్తాయా అన్న ఆశలో గులాబీ నేతలు ఉన్నారు. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమని ఓడలు బండ్లవుతాయి..బండ్లు ఓడలవడం చూశామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖమ్మం పార్లమెంట్ సీటు ఎవరి ఖాతాలో పడుతుందో.... కాంగ్రెస్ నుండి ఎవరికి టికెట్ దక్కుతుందో... హస్తం నేతల మధ్య సఖ్యత ఉంటుందా.. ఎన్నికల్లో విభేదాలు గెలుపును తారుమారు చేస్తాయో అనేది మాత్రం వేచి చూడాల్సిందే.

# 'సందేశ్‌ఖాలీ' కేసు.. 'తృణమూల్'కు కలకత్తా హైకోర్టు షాక్



కలకత్తా: లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. ఇటీవలి కాలంలో రాజకీయ దుమారం రేపిన సందేశ్‌ఖాలీలో మహిళలపై లైంగిక వేధింపులు, భూ కబ్జాల కేసు దర్యాప్తును కలకత్తా హైకోర్టు సీబీఐకి అప్పగించింది. సందేశ్‌ఖాలీలో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నేతలు అక్కడి మహిళలపై లైంగిక దాడులకు పాల్పడడమే కాకుండా వారి భూములు కబ్జా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై అక్కడి మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. తాజాగా సందేశ్‌ఖాలీ అకృత్యాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ కలకత్తా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'సందేశ్‌ఖాలీ అకృత్యాల కేసు చాలా సంక్లిష్టమైనది. ఇందులో నిష్పాక్షిక విచారణ జరగాలి. ఈ కేసును ఎవరు విచారించినా రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని మా అభిప్రాయం. కేసు దర్యాప్తులో భాగంగా సామాన్యుల, ప్రభుత్వ అధికారులు, ఎన్‌జీవోలు ఎవరినైనా విచారించే అధికారం సీబీఐకి ఉంది. కేసు విచారించి సమగ్ర దర్యాప్తు నివేదిక మాకు అందించాలి'అని హై కోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను మే 2వ తేదీకి వాయిదా వేసింది. సందేశ్‌ఖాలీలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నతృణమూల్ నేత షేక్‌షాజహాన్‌ను సీబీఐ ఇప్పటికే అరెస్టు చేసింది. ఇదే కేసులో మనీలాండరింగ్ కోణంపై దర్యాప్తు చేయడానికి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులపై దాడి కేసులో సీబీఐ ఆయను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది. ఈడీ అధికారులపై దాడి కేసును సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోంది. కాగా, సందేశ్‌ఖాలీ ఆందోళనలకు నేతృత్వం వహించిన రేఖాపత్రా అనే మహిళకు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఇచ్చి బరిలోకి దింపింది. సందేశ్‌ఖాలీ అంశం ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్ ఓట్ల శాతానికి భారీగా గండి కొట్టి బీజేపీకి మేలు చేసే అవకాశం ఉందని అంచనాలున్నాయి.

# ఎన్నికల్లో గెలుపుపై చిలుక జోస్యం.. ఇద్దరి అరెస్ట్

చెన్నై: దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల ఫీవర్‌ను క్యాష్ చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూనే ఉన్నారు. తమిళనాడులోని కడలూరు నియోజకవర్గంలో చిలుక జోస్యం చెప్పే సెల్వరాజ్ కూడా ఎన్నికల పేరు చెప్పుకుని ఎంతో కొంత వ్యాపారం పెంచుకుందామని చూశాడు. కడలూరు నియోజకవర్గం?లో పీఎంకే పార్టీ అభ్యర్థి తంగర్ బచ్చన్ గెలవబోతున్నాడని తన వద్ద ఉండే చిలుకతో జోస్యం చెప్పించాడు. సెల్వరాజ్ పంజరం తలుపు తెరవగానే చిలుక వచ్చి అక్కడున్న దేవుడి ఫొటోల్లో నుంచి ఒక ఫొటో తీసింది. అది పీఎంకే అభ్యర్థికి ఇష్టమైన దేవుడి ఫొటో కావడంతో ఈ ఎన్నికల్లో కడలూరు నుంచి ఆయనే గెలువబోతున్నాడని సెల్వరాజ్ ప్రకటించాడు. దీంతో ఎగిరి గంతేసిన అభ్యర్థి తంగర్ బచ్చన్ చిలుకకు సంతోషంతో అరటిపండు తినిపించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంకేముంది పోలీసులు రంగ ప్రవేశం చేసి చిలుక జోస్యం చెబుతున్న సెల్వరాజ్, అతడి తమ్ముడిని అరెస్టు చేశారు. వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ చట్టం సెక్షన్ 4 కింద ఇద్దరిని అరెస్టు చేసి కొద్దిసేపు జైలులో ఉంచి తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు.



# ఫ్రీ బస్సు పథకంతో 1,177 కోట్లు ఆదా

హైదరాబాద్, ఏప్రిల్ 10, అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఫ్రీ బస్సు పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం పట్ల మహిళల్లో పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. అయితే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతమై కుటుంబాల ఆదాయానికి ఊతమిచ్చింది. గత ఏడాది డిసెంబర్ 9న ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఏప్రిల్ 7 వరకు కేవలం నాలుగు నెలల్లోనే మహిళలు రూ. 1,177 కోట్ల విలువైన ఉచిత ప్రయాణాన్ని పొందారు. అంటే బస్ టికెట్లు, పాసుల కొనుగోలుకు మహిళలు ఖర్చు చేసిన మొత్తం రూ. 1,177 కోట్లు ఆదా అయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి, భద్రాద్రి, కొండగట్టు తదితర ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించడానికి మహిళలు పెద్ద సంఖ్యలో ఉచిత బస్సు సర్వీసులను ఉపయోగించుకోవడంతో ఆలయాలకు ఆదాయం పెరిగింది. ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిన గత డిసెంబర్ నుంచి ఆలయాల హుండీ వసూళ్లు గణనీయంగా పెరిగాయి. మొదట్లో రోజుకు సగటున 14 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. ఆ తర్వాత లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరగడంతో రోజుకు సగటున 29.67 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. హైదరాబాద్ లో రోజుకు సగటున ఆరు లక్షల మంది మహిళలు ఉచిత సిటీ బస్సు సర్వీసులను వినియోగించుకుంటున్నారు. ఏప్రిల్ 7న మహిళలకు రూ. 1,177 కోట్ల విలువైన



జీరో టికెట్లను ఆర్టీసీ జారీ చేసింది. గతంలో నగరంలో మహిళలు బస్ పాస్ లు, టికెట్ ఛార్జీల రూపంలో ప్రయాణ ఖర్చుల కోసం నెలకు రూ. 1,500 ఖర్చు చేసేవారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల మహిళలకు ఈ మేరకు ఆదా అయింది. తాము అధికారంలోకి వస్తే మహాలక్ష్మి హామీలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఇస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది.

# సినీ ప్రస్థానం



## రామాయణం.. షాకిస్తున్న స్టార్ల పారితోషికాలు

నితీష్ తివారీ 'రామాయణం' నిరంతరం హెడ్ లైన్స్ లో నిలుస్తోంది. మూడు భాగాలుగా తెరకెక్కనున్న ఈ సినిమా కోసం ఏకంగా 750కోట్లు పైగా ఖర్చు చేయనున్నారని సమాచారం. ఎంపిక చేసుకున్న బడ్జెట్ కి తగ్గట్టే స్టార్ల పారితోషికాలు చుక్కల్లో ఉన్నాయని తెలుస్తోంది. ప్రత్యేకించి రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ లాంటి స్టార్లు అత్యంత భారీ పారితోషికాలు అందుకుంటూ చరిత్ర సృష్టిస్తున్నారు. శ్రీరాముడిగా రణబీర్ కపూర్.. సీతగా సాయి పల్లవి.. రావణుడిగా యష్ నటిస్తున్నారు. రామాయణం కోసం రణబీర్ కపూర్ తీసుకుంటున్న పారితోషికం సాయి పల్లవి కంటే 11 రెట్లు ఎక్కువ. రామాయణంలో సీత పాత్ర పోషించినందుకు సాయి పల్లవి 6 కోట్ల రూపాయలు తీసుకుంటుంది. తన మునుపటి ప్రాజెక్ట్ల కోసం రూ. 2.5 కోట్ల నుండి రూ. 3 కోట్ల వరకు వసూలు చేసింది. అంటే రామాయణం కోసం సాయిపల్లవి తన పారితోషికం రెట్టింపు చేసింది. మూడు భాగాల కోసం సాయి పల్లవి 18 నుండి 20 కోట్ల రూపాయల వరకు తీసుకుంటుందని అంచనా. రామాయణం కోసం రణబీర్ కపూర్ ప్రతి చిత్రానికి రూ. 75 కోట్లు తీసుకుంటాడు. అంటే మూడు భాగాల రామాయణం కోసం రూ. 225 కోట్ల భారీ మొత్తాన్ని సంపాదించే వీలుంది. పోల్చి చూస్తే సాయి పల్లవి కంటే 2400 శాతం ఎక్కువ పారితోషికం రణబీర్ అందుకుంటున్నాడు. మొదటి సినిమా సాధించే విజయం ఆధారంగా రణబీర్ కపూర్ రామాయణం పారితోషికం మారవచ్చు అని కూడా తెలుస్తోంది. ఇతిహాసంలో ప్రధాన ప్రతినాయకుడిగా నటించడానికి యష్ భారీ ప్యాకేజీని అందుకోబోతున్నాడు. ఐ.ఉ.ఈ స్టార్ ఒక్కో సినిమాకి 50 కోట్లు అందుకోనున్నాడు. అంటే మూడు భాగాల కోసం ఏకంగా 150 కోట్లు వసూలు చేస్తున్నాడు. ఇతర స్టార్లకు కోట్లలో పారితోషికాలు ముడుతున్నాయి. పారితోషికాల రేంజుకు తగ్గట్టే స్టార్లు ఏళ్ల తరబడి చిత్రబృందం పని కట్టుబాట్ల కోసం కాల్షీట్లు కేటాయించాల్సి ఉంది.రామాయణం తాజా షెడ్యూల్ రామాయణం ప్రస్తుతం సెట్స్ లో ఉంది. అరుణ్ గోవిల్, లారా దత్తా సెట్స్‌లో కనిపించిన ఫోటోలు ఇంతకుముందు లీకయ్యాయి. ఈ చిత్రంలో రాజా దశరథ్‌గా అరుణ్ గోవిల్ నటిస్తుండగా, లారా దత్తా కైకేయిగా నటిస్తున్నారు. ఈ నెలలో రణబీర్ కపూర్ రామాయణం షెడ్యూల్‌లో పాల్గొంటారని, సాయి పల్లవి , యష్ జూలైలో మాత్రమే షూట్‌లో జాయిన్ అవుతారని తెలుస్తోంది. ఇటీవల అయోధ్యలో రామాయణం కోసం 11 కోట్ల రూపాయల విలువైన సెట్‌ను నిర్మించారు.ఈ సెట్ లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించాల్సి ఉంది. రామాయణం బృందంలో హనుమంతుడిగా సన్నీ డియోల్, మండోదరిగా సాక్షి తన్వర్, లక్ష్మణుడిగా నవీన్ పోలిశెట్టి తదితరులు నటిస్తున్నారు. రామాయణం మొదటి భాగం 2025లో విడుదల కానుంది.రామాయణం 3 భాగాల్లో శ్రీరాముని జీవితంలోని వివిధ దశలను తెరకక్కిస్తారు. రాముని పుట్టుక, సీతతో వివాహం, అజ్ఞాతవాసం, రావణుడితో పోరాటం, ముగింపు ఇలా వరుస అంకాల్ని వరుస చిత్రాల్లో చూపిస్తారు. ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. సాయి పల్లవి సీతాదేవి లాంటి ఐకానిక్ పాత్రతో బాలీవుడ్‌లోకి ప్రవేశించడం చూసి అభిమానులు చాలా థ్రిల్లింగ్‌గా ఉన్నారు.



## దూసుకొస్తున్న యువ కెరటం!

'రాక్షసుడు' వరకూ బెల్లంకొండ శ్రీనివాస్ జర్నీ ఎలా సాగిందో తెలిసిందే. అప్పటికే ఐదారు సినిమాలు చేసాడు. వాటిలో రెండు..మూడు యావరేజ్ గా ఆడటం మినహా తక్కిన చిత్రాల్ని పరజాయాన్నే అందుకున్నాయి. 'రాక్షసుడు' అతడి మొత్తం కెరీర్ లోనే ఇప్పటికీ తొలి హిట్ గా కనిపిస్తుంది. ఆ తర్వాత శ్రీనివాస్ చేసింది కేవలం రెండు సినిమాలే. అవే 'అల్లుడు అదుర్స్' చేసిన తర్వాత 'ఛత్రపతి' హిందీలో రీమేక్ చేసి హిట్ అందుకోవాలనుకున్నాడు. కానీ పనవ్వలేదు. ఆ సినిమా రిలీజ్ అయి ఏడాది సమీపిస్తుంది. దీంతో ఇండస్ట్రీలో సాయి వేగం తగ్గిందనే విమర్శలు కూడా తెరపైకి వచ్చాయి. అయితే వాటన్నింటికి చెక్ పెట్టేలా శ్రీనివాస్ సిద్దమవుతున్నాడు. ఇప్పటికే 'టైసన్ నాయుడు'లో నటిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ సినిమా సెట్స్ లో ఉంది. సాగర్. కె. చంద్ర దర్శకత్వం వహిస్తున్నాడు. దర్శకుడిగా ఇతనికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇన్నోవేటివ్ ఐడియాలతో సినిమాలు చేయడం సాగర్ ప్రత్యేకత. దీంతో బెల్లంకొండని కొత్తగా ప్రజెంట్ చేస్తాడు? అన్న అంచనాలు బాగానే ఉన్నాయి. తాజాగా షైన్ స్క్రీన్ నిర్మాణంలోనూ ఓ సినిమాను మూన్ షైన్ పిక్చర్స్ సంస్థలోనూ మరో సినిమా కమిట్ అయినట్లు సమాచారం. దీంతో బెల్లంకొండ చేతిలో రెడీగా మూడు సినిమాలున్నట్లు తెలుస్తోంది. అయితే కమిట్ అయిన ఈ రెండు చిత్రాలకు దర్శకత్వం వహించేది? ఎవరు ? అన్నది ఇంత వరకూ కన్ఫమ్ కాలేదు. ఈ మూడు సినిమాలకు శ్రీనివాస్ కి మంచి కంబ్యాక్ లా నిలుస్తాయని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. శ్రీనివాస్ ని పెద్ద హీరో చేయాలని నిర్మాత బెల్లంకొండ సురేష్ ఎంతో సీరియస్ గా ప్రయత్నిస్తున్నారు. కుమారుడిని 'ధూమ్' హీరో హృతిక్ రోషన్ రేంజ్ లో చూడాలని....అలాంటి కథలు చేయాలని ఆశపడ్డారు. కానీ శ్రీనివాస్ ఇంకా నిలదొక్కుకునే ప్రాసస్ లోనే ఉన్నాడు. హీరో కటౌట్ అయినా? సరైన హిట్లు పడకపోవడంతో రేసులో వెనుకబడిపోతున్నాడు. తనకన్నా వెనకొచ్చిన వారంతా ముందుకెళ్లిపోతున్నారు. కానీ శ్రీనివాస్ ప్రయత్నాలు మాత్రం ఫలించడం లేదు. మరి 2024 లోనైనా సక్సెస్ దిశగా అడుగులు వేస్తాడా? లేదా? అన్నది చూడాలి.



## సుహాస్.. ఇలా చేస్తాడనుకోలేదు!

మొదట క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించిన సుహాస్ మంచి గుర్తింపును అందుకున్నాడు. మొదటి సినిమా కలర్ ఫోటో క్లిక్కవడంతో నిర్మాతల దృష్టిలో పడ్డాడు. ఇక తర్వాత వచ్చిన సినిమాలు కూడా వేటిక డిఫరెంట్ గా ఉండడంతో సుహాస్ రేంజ్ మరింత పెరిగింది. ముఖ్యంగా రైటర్ పద్మభూషణ్ అనే సినిమాతో పాటు ఆ తర్వాత వచ్చిన అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ సినిమా కూడా కమర్షియల్ గా మంచి కలెక్షన్స్ అందుకున్నాయి.ఇక ఈ హీరోకు ఆ తర్వాత వెంట వెంటనే ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. అయితే సుహాస్ గ్యాప్ లేకుండా ఒకేసారి ఇప్పుడు ఆరు సినిమాలను లైన్లో పెట్టడం కూడా కొంత హాట్ టాపిక్ గా మారిపోయింది. ఈ ఓవర్ ఫ్లో కెరీర్ కు అంత మంచిది కాదు అనే అభిప్రాయాలు వెలబడుతున్నాయి. కాస్త గ్యాప్ తీసుకొని కొత్త తరహా కథలను ప్రమోట్ చేస్తేనే బాగుంటుంది అని కూడా సోషల్ మీడియాలో కామెంట్స్ వచ్చాయి.ఇక ఈ విషయంలో కూడా సుహాస్ ఇదివరకే క్లారిటీ ఇచ్చాడు. ఇది అనుకోకుండా జరిగింది అని కాకపోతే లైన్లో ఉన్న సినిమాలు వేటికవే భిన్నంగా ఉంటాయి అని చెప్పాడు. ఇక మొన్నటి వరకు వచ్చిన మూడు సినిమాల విషయంలో ప్రమోషన్ లో బాగా హడావిడిగా కనిపించిన సుహాస్ ఇప్పుడు నెక్స్ట్ రాబోయే ఒక సినిమా ప్రమోషన్స్ లో మాత్రం పెద్దగా కనిపించడం లేదు.శ్రీరంగా నీతులు అనే సినిమా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇందులో కంచరపాలెం ఫేమ్ కార్తీకరత్నం బేబీ సినిమాలో నటించిన విరాజ్ అశ్విన్ కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నారు. అయితే ఈ సినిమా ట్రైలర్ వచ్చి కూడా చాలా రోజులైంది. కానీ సినిమా ప్రమోషన్స్ కు సంబంధించిన సౌండ్ అయితే ఎక్కడ వినిపించడం లేదు. సుహాస్ మంచి సక్సెస్ ట్రక్ లో ఉన్నప్పటికీ ఈ సినిమాకు ఎందుకు మునుపటి సినిమాల తరహాలో ప్రమోట్ చేయడం లేదు అనే డౌట్స్ క్రియేట్ అవుతున్నాయి.ఇందులో తాను మెయిన్ హీరో కాదు అని కూడా చెప్పినప్పటికీ ఒక సినిమాలో భాగమైనప్పుడు ఎంతో కొంత ప్రమోషన్ చేస్తేనే నిర్మాతలకు కూడా ధైర్యంగా ఉంటుంది. కానీ సుహాస్ మాత్రం తన సినిమా కాదు అన్నట్లుగానే ప్రమోషన్స్ లో సౌండ్ పెంచకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అసలే పోటీగా ఈవారం కొన్ని సినిమాలు దిగుతున్నాయి. గీతాంజలి మళ్లీ వచ్చింది అనే సినిమాతో పాటు విజయ్ ఆంటోనీ లవ్ గురు బాలీవుడ్ మల్టీ స్టారర్ బడే మియా చోటే మియా కూడా తెలుగులో రాబోతోంది.అజయ్ దేవగన్ మైదాన్ సినిమా కూడా హడావిడి చేసే ఛాన్స్ ఉంది కానీ సుహాస్ నటించిన శ్రీరంగనీతులుకు సంబంధించి ఎలాంటి బజ్ అయితే లేదు. ప్రీమియర్స్ కూడా ప్రదర్శిస్తున్నారు. ఆ విషయంలో కూడా ఎలాంటి హడావుడి లేకపోవడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇక సుహాస్ ఈ ఏడాది మరో నాలుగు సినిమాలను కూడా రిలీజ్ చేసే అవకాశం ఉంది. మరి ఆ సినిమాల ప్రమోషన్స్ ను ఎలా ప్లాన్ చేస్తాడో చూడాలి.



## పిల్లలకు ఎంత స్వేచ్ఛ ఇవ్వొచ్చు? నిపుణులు ఏం చెబుతున్నారంటే..

: పిల్లల పెంపకం చిన్నపిల్లల ఆట ఏం కాదు. ఎంతో బాధ్యతతో కూడుకున్నది. ఎంతో జాగ్రత్తగా ఉండాల్సింది. పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పడం దగ్గరి నుండి ఎదుటి వారితో ఎలా మెలగాలి.. ఎలా మాట్లాడాలి అనేది ఒకటికి రెండు సార్లు వారికి చెప్పాలి. చెడు మాటలను, చెడు చేతలను వారించాలి. అలాగే వారు చెప్పేదానికి తల్లిదండ్రులు విలువ ఇవ్వాలి. వాళ్లు చెప్పేది శ్రద్ధగా వినాలి. వారి ఇబ్బందులను తెలుసుకోవాలి. ఇలా చాలా చాలా ఉంటాయి పిల్లల పెంపకంలో. సైకాలజీ టుడే ప్రకారం, చైల్డ్ డెవలప్‌మెంట్ జర్నల్‌లో ఈ సంవత్సరం ప్రచురించబడిన ఇటీవలి అధ్యయనం ప్రకారం, పిల్లలకు వారి స్వంత నిర్ణయాలు తీసుకోవడానికి ఎక్కువ స్వేచ్ఛ ఇవ్వాలి. తల్లిదండ్రులు మరియు పిల్లలు ఇద్దరికీ ఇది ఎంతో మేలు చేసే చర్య అని అధ్యయనంలో తేలింది. పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వడం ముఖ్యం. అయితే అది కొన్ని పరిమితులకు, నిబంధనలకు లోబడి ఉండాలని నిపుణులు చెబుతున్నారు. మెరుగైన మానసిక స్థితిఎక్కువ స్వేచ్ఛ ఉన్న పిల్లలు మానసికంగా మెరుగ్గా ఉంటారని పలు పరిశోధనల్లో తేలింది. వారి స్వంత అవసరాలు చాలా వరకు తీర్చబడతాయని వెల్లడైంది. మరియు కుటుంబం మొత్తం మరింత మానసికంగా ముడిపడి ఉంటుందని తేలింది. శిశువు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఇక్కడ 7 సులభమైన మార్గాలు ఉన్నాయి...శిశువు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఇక్కడ 7 సులభమైన మార్గాలు ఉన్నాయి...స్వేచ్ఛ' వారిని సిద్ధం చేస్తుంది'పిల్లలకి సరైన స్థాయి స్వేచ్ఛ ఇవ్వడం వారిని కౌమారదశకు సిద్ధం చేయడంలో సహాయపడుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎంత స్వాతంత్ర్యం ఇవ్వాలనే దానిపై అనిశ్చితంగా ఉండటం విలక్షణమైనది. కానీ సమాధానం వ్యక్తికి వ్యక్తికి భిన్నంగా ఉంటుంది. మీ పిల్లల వయస్సు ఎంత, ఎంత పరిణతి చెందారు, పిల్లలకు కుటుంబ మద్దతు ఎంత, వారి గత అనుభవాలు మరియు ఇతర అంశాలతోపాటు నిర్దిష్ట పరిస్థితుల్లో వారు ఎంత బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు వంటి చాలా అంశాలపై స్వేచ్ఛ ఎలా ఉండాలనేది ఆధారపడి ఉంటుంది.మీ బిడ్డకు పోషకాహార లోపమా? పోషకాహార లోపం లక్షణాలు, నివారణ మార్గాలు..మీ బిడ్డకు పోషకాహార లోపమా? పోషకాహార లోపం లక్షణాలు, నివారణ మార్గాలు..మీ బిడ్డకు ఎంత స్వేచ్ఛను ఇవ్వాలో మీరు నిర్ణయించుకున్నప్పుడు గుర్తుంచుకోవలసిన కొన్ని పరిగణనలు ఇక్కడ ఉన్నాయి.మీ బిడ్డకు ఎంత స్వేచ్ఛను ఇవ్వాలో మీరు నిర్ణయించుకున్నప్పుడు గుర్తుంచుకోవలసిన కొన్ని పరిగణనలు ఇక్కడ ఉన్నాయి.పిల్లలకు వారి వయస్సుకు ఏది సరైనదో అదే ఇవ్వాలి. చిన్న వయస్సు వారికి ఇచ్చేది లేదా పెద్ద వారికి ఇచ్చేది ఇవ్వవద్దు. అలాగే ఆ వయస్సుకు తగ్గ పనులు చెప్పాలి. వయస్సుతో పాటు మానసిక పరిణితి పెరుగుతుంది. విషయాలను, వస్తువులను, మనుషును క్రమంగా అర్థం చేసుకునే శక్తి వస్తుంది. దానిని బట్టి ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులు నిర్ణయించుకోవాలి. మరీ తక్కువ, మరీ ఎక్కువ కాకుండా పిల్లలకు వారికి అవసరమయ్యే వాటిని అందించాలి. దాని వల్ల వారు అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తుంది.

## మెగా పవర్ ల మధ్య చక్కని చుక్క..!




ఇద్దరు మెగా హీరోల మధ్య చక్కని చుక్క చెన్నై చిన్నది త్రిష కృష్ణన్ దర్శనమిచ్చింది. కోలీవుడ్ లో సూపర్ ఫాం లో ఉన్న త్రిష తెలుగులో ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ సినిమా చేస్తుంది. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర సినిమాలో త్రిష ఫిమేల్ లీడ్ గా నటిస్తుంది. వశిష్ట డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేషాలు షూట్ చేస్తున్నారు. అయితే విశ్వంభర సెట్స్ లోకి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చారు. అన్నయ్య సినిమా షూటింగ్ స్పాట్ కి వెళ్లిన పవన్ కళ్యాణ్ ఆయన తో కాసేపు ముచ్చటించారు. ఇదే టైం లో మెగా హీరోల తో కలిసి త్రిష ఒక ఫోటో దిగింది. ఓ పక్క మెగాస్టార్.. మరోపక్క పవర్ స్టార్ ఇద్దరి మధ్యలో చక్కని చుక్కగా త్రిష అదుర్స్ అనిపించింది. పవన్ తో కూడా త్రిష జత కట్టింది. లవ్ ఆజ్ కల్ రీమేక్ గా వచ్చిన తీన్మార్ సినిమాలో పవన్ తో కలిసి నటించింది త్రిష. ఆ తర్వాత మళ్లీ ఇద్దరు కలిసి నటించిచలేదు. ఆ ఫోటోని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉగాది శుభాకాంక్షలు అంటూ కామెంట్ పెట్టింది. విశ్వంభర సినిమాలో త్రిష హీరోయిన్ గా కేవలం సాంగ్స్ రెండు సీన్స్ అన్నట్టుగా కాకుండా చాలా ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. పాత్ర నచ్చడం వల్లే తెలుగులో అసలు చేసే ఆసక్తి లేకపోయినా త్రిష విశ్వంభరకు సైన్ చేసింది. అంతకుముందు చిరు నటించిన స్టాలిన్ సినిమాలో నటించిన త్రిష మళ్లీ ఇన్నాళ్లకు చిరుతో కలిసి జత కడుతుంది. చిరు ఆచార్యలో కూడా త్రిష నటించాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల కుదరలేదు. విశ్వంభర సినిమాతో తెలుగులో మరోసారి తన సత్తా చాటాలని చూస్తుంది త్రిష. విశ్వంభర తర్వాత త్రిష వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణ ఇలా సీనియర్ స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. త్రిష టాలీవుడ్ రీ ఎంట్రీ ఆమెకు ఎలాంటి రిజల్ట్ అందిస్తుందో చూడాలి. కోలీవుడ్ లో తన ఫాం తెలుసు కాబట్టి త్రిషకు అడిగిన దానికన్నా ఎక్కువ రెమ్యునరేషన్ ఇచ్చేందుకు కూడా తెలుగు నిర్మాతలు వెనకాడట్లేదని తెలుస్తుంది.

## కోహ్లీ నుంచి రోహిత్ వరకు.. స్టార్ ప్లేయర్లకు షాకిచ్చిన బీసీసీఐ.. కొత్త రూల్‌తో వేలం నుంచి ఔట్?

ఐపీఎల్ 17వ సీజన్ మెల్లగా తదుపరి దశకు చేరుకుంటుంది. ఈ సీజన్‌లో గట్టి ప్రదర్శన చేస్తూ.. వచ్చే సీజన్‌కు నిర్వహించనున్న మెగా వేలంలో తమ డిమాండ్‌ను పెంచుకోవాలని ఆటగాళ్లు కూడా భావిస్తున్నారు.ఈ సంవత్సరం చివరిలో ఎఖఒ 2025 మెగా వేలం ఉంటుంది. దీనిలో ప్రతి జట్టు రూపం మారుతుంది. కానీ, ఈ మెగా వేలంలో కీలక ఆటగాళు కనిపించరు. బీసీసీఐ మార్చాలని భావిస్తున్న నియమం దీనికి కారణం కావచ్చు.టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తల ప్రకారం, ఈ సంవత్సరం చివరిలో జరగనున్న మెగా వేలంలో అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల సంఖ్యను పెంచాలని ః అఅఎ పరిశీలిస్తోంది. నివేదిక ప్రకారం, ః అఅఎ ఎఖఒ ఫ్రాంచైజీల నుంచి ఓ సలహాను కూడా అందుకుంది. నివేదిక ప్రకారం, అహ్మదాబాద్‌లో సమావేశానికి బోర్డు మొత్తం 10 ఫ్రాంచైజీల యజమానులకు ఆహ్వానాలు పంపింది.వినిపిస్తోన్న వార్తల మేరకు.. పనులు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. లీగ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు బోర్డు ఆలోచనలు చేస్తోంది. ప్లేయర్ నిలుపుదల ఒక ముఖ్యమైన సమస్య. అనధికారిక చర్చలో, చాలా ఫ్రాంచైజీలు వేలానికి ముందు 8 మంది ఆటగాళ్లను ఉంచుకోవడానికి అనుకూలంగా ఉన్నాయని తెలుస్తోంది.గత మెగా వేలంలో, ఫ్రాంచైజీలు నలుగురు ఆటగాళ్లను ఉంచుకోవడానికి అనుమతించారు. వారు రైట్ టు మ్యాచ్ కార్డ్‌ని ఉపయోగించి ఒక ప్లేయర్‌ని జోడించవచ్చు. దీంతో ఫ్రాంచైజీలు మొత్తం 5 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకునే అవకాశం లభించింది. అందులో ఇద్దరు విదేశీ ఆటగాళ్లు ఉండాలి. జట్టు కూర్పులో కొనసాగింపు ముఖ్యమని చాలా ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. కోర్ టీమ్‌ను మళ్లీ మళ్లీ విచ్ఛిన్నం చేయడం వల్ల ప్రయోజనం లేదని ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో సహా గత మెగా వేలంలో చాలా జట్లు సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది.ఢిల్లీ క్యాపిటల్స్‌పై తీవ్ర ప్రభావం పడింది. క్యాపిటల్స్ ఒక బలమైన జట్టును సిద్ధం చేసింది. అది 2020లో ఫైనల్స్‌కు చేరుకుంది. అయితే మెగా వేలంలో నలుగురు ఆటగాళ్లను ఉంచుకోవాలనే నియమం కారణంగా, క్యాపిటల్స్ చాలా మంది ఆటగాళ్లను కోల్పోవలసి వచ్చింది. కొన్ని ఫ్రాంచైజీలు తమ జట్టును బలోపేతం చేయడానికి వేలంలో ఎక్కువ మంది ఆటగాళ్లను కోరుకుంటున్నందున ఈ నియమానికి వ్యతిరేకత ఉండవచ్చునని వర్గాలు చెబుతున్నాయి. లీగ్‌లో 10 జట్లు ఉన్నాయి. ఇప్పుడు రిటైన్ చేసిన ఆటగాళ్ల సంఖ్య పెరిగితే, పెద్ద ఆటగాళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది.



## అల్లాదుర్గం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గఎన్నిక....



.ఆందోల్ (శ్రీ ప్రస్థానంన్యూస్):-మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఆల్లాదుర్గంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలోని అతిథి భవనంలో జర్నలిస్టుల సమావేశంలోని నిర్వహించారు ఈ సందర్భంగా మండల ప్రెస్ క్లబ్ కమిటీని ఎన్నుకునేందుకు సమావేశంలో చర్చించారు అయితే మండల స్థాయిలో కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఇదే మొదటిసారి. అని ఈ ఎన్నికల్లో అల్లాదుర్గం మండల ప్రెస్ క్లబ్ తొలిఅధ్యక్షులుగా రఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, గౌరవ అధ్యక్షులుగా భూమయ్య, ఉపాధ్యక్షులుగా వీరేందర్, రమేష్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కార్యదర్శిగా పాపయ్య, కోశాధికారిగా వెంకటరామ్, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, వెంకట్ ,నరేష్ , సాయిలు సలహాదారులుగా శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల సాధన కోసం అందరితో కలిసి సంయుక్తంగా పనిచేస్తామని అన్నారు

## బంజారా సమాజం కోసం ప్రత్యేక ఏకలవ్య పాఠశాలల ఏర్పాటుకు కృషి చేస్తానన్న మంత్రి- ఎంపీ బీబీ పాటిల్



అందోల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):-అందోల్ నియోజకవర్గం టెక్మల్ మండలంలోని బంజారా సమాజం కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీశ్రీశ్రీ పౌరదేవి మఠం పీఠాదిపతులు బాబూ సింగ్ మహారాజ్ , బాబు సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ భోగ్ భండార్ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, మరియు వెంకటరామిరెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి వేడుకలను జాతీయ స్థాయిలో జరుపుటకు అనేక సార్లు పార్లమెంట్ లో ప్రస్తావించానని తెలిపారు. బంజారా సమాజం కోసం ప్రత్యేక ఏకలవ్య పాఠశాలలు పిట్లం, ఇంకొన్ని మండలాల్లో ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం కోసం గత పది సంవత్సరాలుగా కృషి చేస్తున్నాను. అలాగే స్కిల్ డెవలప్మెంట్, స్టడీ సర్కిల్ వంటి అనేక విద్యా రంగం లో ప్రయత్నం చేసినా కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు వేరు వేరు అయినందున అనుకున్న స్థాయిలో అభివృద్ధి పనులు పూర్తి కావాల్సి ఉందని , ఇప్పుడు కేంద్రం లోని మోడీ ప్రభుత్వం దేశాన్ని విశ్వగురువుగా నిలుపుటకు ఎన్నో రకాలుగా కృషి చేస్తున్నది. అందులో భాగంగా ఇప్పుడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వస్తే ఇంకా మరికొన్ని విధానాలు అభివృద్ధి చెందుతాయని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎన్నికల ప్రచారంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి..





శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్ నియోజకవర్గం లోని పిర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఎం బి ఆర్ కాన్వెంషన్ లో జరిగిన పాత ఘట్కేసర్ మండలం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి లక్ష్మ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు డాక్టర్ భద్ర రెడ్డి, మున్సిపల్ మేయర్లు,డిప్యూటీ మేయర్,మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్లు, పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ లు, సర్పంచ్లు, కో అప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాధ్లుర్ గ్రామంలో మురికి వాసనతో హాస్పిటల్ పాలవుతున్న ఎస్సీ కాలనీవాసులుపట్టించుకోని గ్రామ పంచాయతీ సెక్రెటరీ కీర్తి రెడ్డి





టేక్మాల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):-మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మల్ మండల పరిధిలోని కాధ్లుర్ గ్రామంలో ఎక్కడి పనులు అక్కడే పెండింగ్లో ఉన్నాయి ఎస్సీ కాలనికి సంబంధించిన మురికి కాలువలు శుభ్రం చేయించలేకపోతున్న గ్రామపంచాయతీ సెక్రటరీ కీర్తి రెడ్డి ఎస్సీ కాలనికి పోవాలంటే ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది అని ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు ఎన్నిసార్లు గ్రామపంచాయతీ సెక్రటరీకి విన్నవించుకున్న కానీ మా ఎస్సీ కాలనీకి సంబంధించిన మురికి కాలువలు శుభ్రపరచలేకపోతున్న గ్రామ సెక్రెటరీ కీర్తి రెడ్డి మురికి కాలువలు శుభ్రం చేయుమని అడిగితే గ్రామపంచాయతీలో అమౌంటు లేదు నేను ఎలా చేయాలి అని సమాధానం ఇస్తుందని గ్రామ ప్రజలు వాపోతున్నారు ఎస్సీ కాలనీ అంటే చిన్న చూపు చూస్తున్నట్టు ఎస్సీ కాలనీవాసులు తెలిపారు ఎమ్మెల్యే ఎలక్షన్లో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ గారికి మురికి కాలువలు శుభ్రం లేవు తాగడానికి వాటర్ రావడం లేదు అని విన్నవించుకున్నప్పుడు కలెక్టర్ గారు అధికారులను పంపించి ఎస్సీ కాలనీలో ఎక్కడ ఇబ్బంది ఉన్నది అక్కడ ఇబ్బంది లేకుండా చేయాలని చెప్పినా కానీ కలెక్టర్ గారి ఎమ్మెల్యే గారి మాటలు పట్టించుకోని అధికారులు ఇప్పటికైనా ఎస్సీ కాలనీ లో ఉన్నటువంటి ప్రాబ్లం పై అధికారులు స్పందించి వెంటనే ఎస్సీ కాలనీలో ఉన్నటువంటి మురికి కాలువలు శుభ్రపరచాలని ఎస్సీ కాలనీ వాసులు తెలిపారు లేని పక్షంలో మెదక్ జిల్లా కలెక్టర్ గారిని ముట్టడిస్తామని ఎస్సీ కాలనీవాసులు అంటున్నారు

# సామాజిక అసమానత,అస్పృశ్యత లపై సమరం చేసిన సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే



-స్త్రీలు చదువుకోవాల్సిందే అని పట్టుబట్టి.. ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త
-బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలిచిన పోరాట యోధుడు
-నేడు ఆయన జయంతి

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహానుభావుడు. స్త్రీలు చదువుకోవాల్సిందే అని పట్టుబట్టి.. ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త. బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలిచిన పోరాట యోధుడు? మహాత్మా జ్యోతిరావు పూలే. భౌతికంగా ప్రపంచాన్ని వదిలి 128 ఏళ్లయినా.. బడుగుల మేలు కోసం పూలే పడిన ఆరాటం? ఇప్పటికీ స్ఫూర్తిని పంచుతోంది. ఇవాళ ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా.. పూలే సేవలను దేశం స్మరించుకుంటోంది.మహాత్మా జ్యోతిరావు పూలే. సమాజంలో అన్ని వర్గాలకూ సమాన హక్కులు ఉండాలనీ.. స్త్రీలు సంఘంలో భాగం కావాల్సిందే అని పోరాటం చేసి.. దేశాన్నే మేల్కొలిపిన మహనీయుడు. అగ్రవర్ణాల నుంచి కుల వివక్షను ఎదుర్కొన్నా.. ఆఖరికి చదువుకునేందుకు పరిస్థితులు సహకరించకున్నా.. అన్నీ తట్టుకుని.. అందరి కోసం జీవితం అంకితం చేశారు పూలే. వెనకబడిన కుటుంబంలో పుట్టి.. చిన్నప్పటి నుంచే కష్టాలు ఎదుర్కొన్న పూలే.. సత్య శోధక్ సమాజ్ పేరుతో ఓ సంస్థ ఏర్పాటు చేశారు. బలహీన వర్గాల తరఫున పోరాడారు. వారికి అన్ని హక్కులూ అందాలని గొంతెత్తారు.పూలే బాల్యం కష్టాలతో మొదలైంది. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో.. 1827 ఏప్రిల్ 11న పూలే పుట్టారు. 9 నెలల వయసులోనే పూలే తల్లి చిమన చనిపోయారు. తండ్రి గోవిందరావు ఇంకో పెళ్లి వద్దనుకోవడంతో నర్సు సంరక్షణలో పెరిగారు. ఇబ్బందుల మధ్యే.. ప్రాథమిక విద్య పూర్తి చేశారు. చివరికి చదువు మానేసి తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయపడ్డారు. 12 ఏళ్ల వయసులోనే.. సావిత్రీబాయితో పూలే వివాహం జరిగింది. అప్పటి వరకు.. బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ పెరిగిన పూలే.. పెళ్లి తర్వాత అందరి సంక్షేమం కోసం ఇంటి నుంచే కార్యాచరణ మొదలు పెట్టారు.సమాజంలో మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పూలే పని చేశారు. భార్య సావిత్రీబాయికి చదువు చెబుతూ.. మహిళా విద్య కోసం పోరాటం మొదలు పెట్టారు. ఆమె కూడా సహకరించడంతో.. పూలే మరింతగా జనాల్లోకి వెళ్లారు. 1848లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఓ స్కూల్ ను ఏర్పాటు చేశారు. ఇలాంటిది.. దేశంలో ఇదే మొదటిదని కొందరంటారు. ఇక.. అగ్రవర్ణానికి చెందిన స్నేహితుడి ఇంట్లో పెళ్లికి వెళ్లి.. అవమానానికి గురైన పూలే.. ఆ సందర్భం నుంచి బలహీన వర్గాల తరఫున పోరాటానికి సిద్ధమయ్యారు. కుల, మతాకు అతీతంగా.. ప్రజలందరికీ సమాన హక్కులు ఉండాలంటూ గొంతెత్తారు.పూలే పోరాటానికి సమాజంలోని అన్ని వర్గాలనుంచి మెల్లగా మద్దతు పెరిగింది. ఇదే ఉత్సాహంతో.. 1851లో అమ్మాయిల కోసం పెద్ద స్కూల్ ఏర్పాటు చేశారు. గణితం, చరిత్ర, జాగ్రఫీ బోధిస్తూ? ప్రపంచంపై అవగాహన కల్పించారు. ఇలాంటివే మరిన్ని స్కూళ్లు ఏర్పాటు చేసి బాలికల విద్య కోసం వీలైనంతగా కృషి చేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన పూలే? వితంతువుల పెళ్లిళ్లకు అండగా నిలిచారు. గర్భవతులుగా ఉన్న వితంతువుల కోసం ప్రత్యేక సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. భార్య సావిత్రీబాయితో కలిసి.. అంటరానితనం రూపుమాపేందుకు జనంలో చైతన్యం పెంచారు.జీవితాన్ని పూర్తిగా బడుగుల పోరాటానికే అంకితం చేసిన పూలే దంపతులకు.. పిల్లలు లేరు. వితంతువుల కోసం ఏర్పాటు చేసిన సేవా కేంద్రం నుంచే ఓ శిశువును దత్తత తీసుకున్నారు. ఆ బాబు డాక్టర్ చదువు పూర్తి చేసి పూలే దంపతులు చూపిన మార్గంలోనే సమాజ సేవ చేశారు. ఒంట్లో శక్తి ఉన్నంత వరకు పేదల సంక్షేమానికి పాటుపడిన మహాత్మా పూలే.. 1888 జూలైలో అనారోగ్యంతో మంచాన పడ్డారు. రెండేళ్ల తర్వాత.. ఆరోగ్యం విషమించడంతో.. 1890 నవంబర్ 28న కన్నుమూశారు.

# పతంజలి క్షమాపణలు తిరస్కారం

### చర్యలకు సిద్దంగా ఉండండి

### ఘాటుగా హెచ్చరించిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ,ఏప్రిల్10 : తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి రెండోసారి క్షమాపణలు చెప్పడాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది, బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ దాఖలు చేసిన అఫిడవిట్ ను బుధవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. బాబా రామ్‌దేవ్ కోర్టు ధిక్కార చర్యలను తేలికగా తీసుకుంటు న్నారని సుప్రీంకోర్టు పేర్కొంది. తమ ఆదేశాలను పదేపదే ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందకు క్షమాపణ సరిపోదని.. కోర్టు ధిక్కరణ చర్యలకు సిద్ధంగా ఉండండని హిమా కోహ్లీ, అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. వారి క్షమాపణలను అంగీకరించబోమని, చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. వారివురు సమర్పించిన ప్రమాణ పత్రాలను జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ఈ కేసులో తాము ఉదారంగా వ్యవరించలేమంటూ స్పష్టంచేసింది. పతంజలి ధిక్కరణ కేసులో బుధవారం విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. మీరు కోర్టు పట్ల ఏ విధంగా అయితే అలక్ష్యంగా వ్యవహరించారో.. అలానే మీ క్షమాపణ పట్ల మేమెందుకు వ్యవహరించకూడదు? మీ క్షమాపణ మీద మాకు నమ్మకం లేదు. దాన్ని తిరస్కరిస్తున్నాం అని ధర్మాసనం పేర్కొంది. తమకు క్షమాపణలు చెప్పడానికి ముందే వారు తమ అఫిడవిట్లనను మీడియాకు పంపారు. నిన్న రాత్రి 7.30 గంటల వరకు అవి మాకు అప్‌లోడ్ అవ్వలేదు. దీనిబట్టి ప్రచారం కోరుకుంటున్నారని అర్థం అవుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



ఇది కేవలం ఒక ఎఫ్ఎంసీజీ కంపెనీకి సంబంధించిన వ్యవహారం కాదని, న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘిస్తే ఏం జరుగుతుందనే విషయం సమాజంలోకి వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో చర్యలు తీసుకోనందుకు ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీని సైతం మందలించింది. పదే పదే ఉల్లంఘనలు జరుగుతున్నా హెచ్చరించి విడిచిపెట్టడం తప్ప అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించింది. లైసెన్సింగ్ అథారిటీలో ఉన్న ముగ్గురు అధికారులను ఇప్పుడే సస్పెండ్ చేయాలని ధర్మాసనం పేర్కొంది. పతంజలి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనం ముందు మాట్లాడుతూ.. జీవితంలో మనుషులు తప్పులు చేస్తుంటారు. అయితే, అటువంటి కేసుల్లో వ్యక్తులు బాధపడాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనికి ప్రతిస్పందించిన అత్యున్నత న్యాయస్థానం న్యాయవాదిని మందలించింది. మేం అంధులు కాదు.. ఈ విషయంలో ఉదారంగా వ్యవహరించాలనుకోవడం లేదు అని ధర్మాసనం బదులిచ్చింది. పతంజలి డయాబెటిస్, ఆస్తమా వంటి వ్యాధులను ఆయుర్వేదిక్ మందులు, యోగాతో పూర్తిగా నయం చేస్తుందని అడ్వటైజింగ్ చేయడాన్ని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ తప్పుబట్టింది. రామ్ దేవ్ బాబా మెడిసిన్ వాడకంపై వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని కోర్టుకు ఫిర్యాదు చేసింది. రామ్‌దేవ్‌పై భారత శిక్షాస్మృతి లోని 188, 269, 504 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.గతంలో కోవిడ్ -19 వ్యాక్సినేషన్‌కు వ్యతిరేకంగా పతంజలి వ్యవస్థాపకులు రామ్ దేవ్ బాబా క్యాంపెయిన్ నిర్వహించిందని ఆరోపిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

## మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి..



శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ తో కలిసి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సతీష్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు..

## అంతారం గ్రామంలో ఘనంగా జాతర ఉత్సవాలు





నర్సాపూర్ (ప్రస్థానం న్యూస్)కౌడిపల్లి మండల అంతారం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా పెద్దమ్మ, దుర్గమ్మ, పోచమ్మ అమ్మవారుల జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దలు చిన్నలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల విజ్ఞప్తి

## ఎస్సై మహమ్మద్ గౌస్



నర్సాపూర్ (ప్రస్థానం న్యూస్)?రోడ్డుపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రతిఏటా ప్రమాదాల బారిన పడి ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి..!?కుటుంబ పెద్దను కోల్పోయి ఎన్నో కుటుంబాలు దీనావస్థలో ఉంటున్నాయి..!?దయచేసి ఇతరులు మీ వల్ల ప్రమాదాలకు గురి కాకుండా ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టకండి..!?రోడ్లపై వరి ధాన్యం ఆరబెట్టబడిన సదరు యాజమాన్యం పై చట్టరీత్య చర్యలు తీసుకోబడును...!

## రాజ్‌ఠాక్రేపై ఏ ఫైల్ ఓపెన్ చేశారు: సంజయ్ రౌత్

ముంబై: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించిన మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్‌ఠాక్రేపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తీవ్ర విమర్శలు గుప్పించారు.రాజ్ ఠాక్రేపై ఏదో ఫైల్ ఓపన్ చేశాని.. అందుకే ఒక్కసారిగా బీజేపీకి తన మద్దతు ప్రకటించారని సంజయ్ రౌత్ అన్నారు.’ఒక్కసారిగా ఏదో విచిత్రం జరిగింది. మేము ఈ విషయాన్ని రాజ్‌ఠాక్రేను అడగదలుచుకున్నాం. ఒక్కసారిగా మారిపోయి మహారాష్ట్ర శత్రువుల(ప్రత్యర్థుల)వైపు చేరి పూర్తి మద్దతు ఇస్తున్నారు. మీరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? అని సంజయ్ రౌత్ ప్రశ్నించారు.మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రేకు సోదరుడైన రాజ్ ఠాక్రే... తన పార్టీ బీజేపీ, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ (ఎన్సీపీ) కూటమికి సంపూర్ణ మద్దత ఇస్తుందని ప్రకటించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్ ఠాక్రే.. తన పార్టీ కేవలం ప్రధాని నరేంద్రమోదీ, ఎన్డీయే కూటమికే మాత్రమే మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తనకు 1990 నుంచి బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. మొదటి నుంచి నరేంద్ర మోదీ.. ప్రధాని అవుతారన్న వారిలో తాను ఒకరినని చెప్పారు.ఇక.. ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన(యూబీటీ) ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న విషయం తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757